ఆంధ్ర జన కేంద్ర సంఘం...

తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఆంధ్ర సంఘాలన్నింటినీ కలిపి ఒకే సంస్థగా రూపొందించడానికి 1923లో 'ఆంధ్ర జనకేంద్ర సంఘాన్ని' ఏర్పాటు చేశారు. దీనికి మాడపాటి హన్మంతరావును కార్యదర్శిగా, బారిష్టరు రాజగోపాలాచారిని అధ్యక్షుడుగా నియమించారు. ఈ సంఘం మొదటి సమావేశం 1923 జూలై 27న హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశానికి సంబంధించి వెట్టిచాకిరి, వర్తక సంఘం అనే కరపత్రాలను ప్రచురించింది. తెలంగాణలో తెలుగు పాఠశాలలు, గ్రంథాలయాల ఏర్పాటు, తెలుగులో పుస్తకాల ప్రచురణ, ప్రధానంగా చారిత్రక పరిశోధనలకు విశేషమైన కృషి చేసింది. ఈ సంఘం 'నిజాం ఆంధ్రరాష్ట్ర ప్రశంస', 'నిజాం రాష్ట్ర ఆంధ్రులు' వంటి గ్రంథాలు ప్రచురించింది.

రెండో 'ఆంధ్ర జన కేంద్ర సంఘం' సదస్సు 1924 నల్గొండలో, మూడోది 1925లో ఖమ్మం జిల్లా మధిరలో, నాలుగో సభ 1928లో నల్గొండ జిల్లా సూర్యాపేటలలో జరిగాయి. ఈ సంఘం తెలంగాణలో గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించింది. 1925 మొదట గ్రంథాలయ సదస్సు జరిగింది. 1926లో జరగాల్సిన గ్రంథాలయ సదస్సుకు నిజాం అనుమతించలేదు.

'ఆంధ్ర జన కేంద్ర సంఘం' 'లక్ష్మణరాయ పరిశోధక మండలి' అనే చారిత్రక సొసైటీని కొమర్రాజు లక్ష్మణరావు పేరు మీద స్థాపించింది. 1930లో వరంగల్ చారిత్రక సదస్సు జరిగింది. ఆ సదస్సులో కాకతీయుల చరిత్ర గురించి వివరంగా చర్చించారు. ఆ సందర్భంగా 'కాకతీయ సంచిక'ను ప్రచురించారు. 1928లో 'జనసంఘ' వారు హైదరాబాద్‌లో ఆంధ్ర బాలికల హైస్కూలుని ప్రారంభించారు. తెలుగు భాషలోనే బోధన జరిగింది.

సురవరం ప్రతాపరెడ్డి 'గోల్కొండ పత్రిక', 1922లో 'సబ్నవీసు వెంకటరామ నరసింహారావు' సంపాదకత్వంలో స్థాపించిన 'నీలగిరి పత్రిక', 1922లో బద్దిరాజు సీతారామచంద్రరావు సంపాదకత్వంలో వెలువడిన 'తెలుగు పత్రిక' ఆంధ్ర భాషా సాహిత్యాలకు విశేష కృషి చేశాయి. చిలుకూరి వీరభద్రరావు రచించిన 'ఆంధ్రుల చరిత్ర' సురవరం ప్రతాపరెడ్డి రచించిన 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర', 'హిందువుల పండగలు', ఖండవల్లి లక్ష్మీరంజనం రచించిన 'ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి' వంటి గ్రంథాలు ఆంధ్రుల గత వైభవాన్ని స్ఫురణకు తెచ్చి, తెలుగు జాతిని చైతన్యపరిచాయి.

కాకినాడలో హైదరాబాద్ రాజకీయ మహాసభ

1923లో 'భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలు' కాకినాడలో జరిగాయి. 'మౌలానా మహమ్మదాలీ' అధ్యక్షత వహించారు. హైదరాబాద్ నుంచి 500 మంది ప్రతినిధులు కాకినాడ మహాసభకు హాజరయ్యారు. హైద్రాబాద్ సంస్థాన ప్రజల భవితవ్యానికి సంబంధించిన ప్రధాన తీర్మానాలు చర్చించి, సభలో ఆమోదించారు. తీర్మానాల ముసాయిదాను బూర్గుల రామకృష్ణారావు తయారు చేశారు. కాంగ్రెసు మహాసభ ముగియగానే హైదరాబాద్ నుంచి వెళ్లిన ప్రతినిధులు కాకినాడలోనే మొట్టమొదటి హైదరాబాద్ రాజకీయ మహాసభను జరిపారు. బీరారుకు చెందిన 'మాధవరావు అణే' ఈ సభకు అధ్యక్షత వహించారు. ఈ మహాసభలో మూడు ప్రధాన తీర్మానాలు ఆమోదించారు. మొదటిది హైదరాబాద్ సంస్థానంలో రాజకీయ సంస్కరణలను అమలు జరపాలని కోరడం, రెండోది-బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని, వాక్ స్వాతంత్ర్యం ఉండాలనీ తీర్మానించారు.

రెండో రాజకీయ మహాసభను హైదరాబాద్ సంస్థానంలో నిర్వహించడానికి నిజాం ప్రభుత్వం అనుమతించకపోవడంతో.. రెండో సభను వై.ఎమ్. కాళే అధ్యక్షతన బొంబాయిలో నిర్వహించారు. హైదరాబాద్ మూడో రాజకీయ మహాసభ 1928లో పుణేలో, ఎన్.సి. కేల్కర్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రసంగించారు. 'ప్రజాస్వామ్య ప్రభుత్వ స్థాపనే కాంగ్రెస్ లక్ష్యం' అని ఉద్ఘాటించారు. హైదరాబాద్ నాలుగో రాజకీయ మహాసభ 1931న బీరారులోని అకోలాలో జరిగింది. దీనికి రామచంద్ర నాయక్ అధ్యక్షత వహించారు. ఇలా నాలుగు రాజకీయ మహాసభలను హైదరాబాద్ సంస్థాన ప్రజలు రాష్ట్ర సరిహద్దుల బయట జరుపుకోవాల్సి వచ్చింది.

ప్రాక్టీస్ ప్రశ్నలు...

1.1923లో మొట్టమొదటి 'హైదరాబాద్ రాజకీయ మహాసభను ఎక్కడ నిర్వహించారు?

ఎ) రాజమండ్రి బి) కాకినాడ

సి) మచిలీపట్నం డి) హైదరాబాద్

2.మొట్టమొదటి నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ సదస్సు ఎప్పుడు, ఎక్కడ జరిగింది?

ఎ) 1929, హైదరాబాద్‌లో బి) 1922, నిజామాబాద్‌లో

సి) 1930, జోగిపేటలో (మెదక్ జిల్లా)

డి) 1925, దేవరకొండలో

3.మొట్టమొదటి నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభకు అధ్యక్షుడుగా ఎవరు వ్యవహరించారు?

ఎ) సురవరం ప్రతాపరెడ్డి　　బి) ఆరుట్ల రామచంద్రారెడ్డి
సి) కె.వి. రంగారెడ్డి　　డి) మాడపాటి హన్మంతరావు

4.యాదగిరి లక్ష్మీ నరసింహా దేవాలయంలో హరిజనుల ప్రవేశాన్ని 1934లో ఎవరు చేయించారు?

ఎ) ఆరుట్ల రామచంద్రారెడ్డి　　బి) ఆరుట్ల లక్ష్మీ నరసింహం
సి) కాళోజీ నారాయణరావు　　డి) రాజ్ బహద్దూర్ గౌడ్

5.హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌కు 1938లో తాత్కాలిక అధ్యక్షుడుగా వ్యవహరించిందెవరు?

ఎ) స్వామీ రామానందతీర్థ　　బి) గోవిందరావు నానాల్
సి) బూర్గుల రామకృష్ణారావు　　డి) మాడపాటి హన్మంతరావు

జవాబులు	1	2	3	4	5
	B	C	A	A	B